

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు

వేసవిలో దుక్కులు దున్నుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు

యాచారం, మార్చి 25 : వేసవిలో దుక్కులు దున్నుకొని పొలాలను సాగుకు సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నరసింహారావు రైతులకు సూచించారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో ఉన్న రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పంటల సాగు నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు అందజేశారు. నానో ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగు నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, లాభాలను పొందే పంటలపై రైతులు మక్కువ పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అంతర పంటలపై దృష్టి సారించాలన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, ఆయిల్‌పామ్, పట్టుపురుగుల పెంపకాన్ని ఆధునిక పద్ధతులతో సాగు చేయాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు ఉన్నారు.

చేమ దుంప, మొరంగడ్డలపై

ఎస్సీ మహిళలకు అవగాహన సదస్సు

ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల అధికారి వైజయంతి కళ్యాణ్



ఎస్సీ మహిళలకు చేమదుంప, మొరంగడ్డ దుంపలు, తీగలను అందజేస్తున్న వైజయంతి కళ్యాణ్

వికారాబాద్, మార్చి 25 : చేమ దుంప, మొరంగడ్డలపై ఎస్సీ మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు వికారాబాద్ నియోజకవర్గ ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల అధికారి వైజయంతి కళ్యాణ్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కూరగాయల పరిశోధన స్థానం, రాష్ట్ర ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ, వికారాబాద్ జిల్లా వారి ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సు, దుంప విత్తన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో చేమగడ్డ (కాలోకేసియా), మొరంగడ్డ (స్వీట్ పొటాటో) చాలా ముఖ్యమైనదన్నారు. తెలంగాణలో కేవలం రంగారెడ్డి జిల్లాలో మాత్రమే చేమగడ్డ సాగు చేయబడుతుందని చెప్పుకొచ్చారు. వికారాబాద్ పట్టణ పరిసర ప్రాంతాల్లోని అత్వెల్లి, కొంపల్లి, మదనపల్లి, ఎర్రవల్లి, పులమద్ది గ్రామాల్లోని భూములు ఈ దుంప పంటలకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. హైదరాబాద్‌కు సమీపాన ఉండడం వలన కూరగాయల సాగు చేపట్టవచ్చని చెప్పారు. శివరాత్రి, రంజాన్ పండుగ సమయాల్లో మొరంగడ్డ(స్వీట్ పొటాటో)కు మంచి డిమాండ్ ఉంటుందని చెప్పారు. లాభదాయక పంటలు వేయడానికి రైతులు ముందుకు రావాలని.. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, పథకాలను అందిపుచ్చుకోవాలని రైతులను కోరారు.

శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కూరగాయల పరిశోధన స్థానం, రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ మాట్లాడుతూ.. చేమగడ్డ, మొరం గడ్డ సాగు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఇవి పిండి పదార్థాలు, ఖనిజాలతోపాటు విటమిన్ ఎ, బిలను కలిగి ఉంటుందని తెలిపారు. తక్కువ కాల పరిమితిలో ఎక్కువ ఉత్పత్తిని ఇచ్చే ఈ కూరలను కూరగాను, పచ్చిగా తినడానికి, ఆకులను పశువుల దాణాగా, ఆల్కహాల్ తయారీలోనూ ఉపయోగిస్తారని తెలిపారు. దుంప రైతులకు సాగులో సలహాలు, సూచనలు అందజేశారు. ఇవి ఉష్ణ మండల పంటలు. ఈ పంటకు భూమిలో తేమ అధికంగా ఉండాలని వివరించారు. నేలలు, వాటి స్వభావాన్ని వివరించారు. తెలంగాణలో చేమగడ్డ ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు నాటడానికి అనుకూలమని తెలిపారు. మంచి పద్ధతులతో నాటినచో మంచి దిగుబడిని పొందవచ్చని పేర్కొన్నారు. మార్కెట్‌లో వీటికి ఏ ఇబ్బంది లేని మార్కెట్ సదుపాయాలు కలవని సూచించారు.

శాస్త్రవేత్త డాక్టర్ వీర సురేశ్ మాట్లాడుతూ.. చేమదుంపలోని శతముఖి, భావపురి వంటి రకాలు, వాటి దిగుబడిని వివరించారు. మొరంగడ్డలోని సామ్రూట్, కిరణ్ రకాలు, వాటి దిగుబడిని తెలిపారు. చేమదుంప పంట దుంపలతో, మొరంగడ్డ పంట తీగలతో నాట బడుతుందన్నారు. ఈ పంటల్లో చేపట్టాల్సిన అంతరకృషి చర్యలు, వేసుకోదగిన అంతర్‌పంటలు, కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపే తెలియజేశారు. ఈ పంటల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల గురించి, వీటితో తయారు చేసుకొనే పదార్థాల గురించి వివరించారు. రైతులు తమ అనుభవాలను మిగతా రైతులతో పంచుకున్నారు. సదస్సు ముగింపులో రైతులకు చేమగడ్డ విత్తనాలు, మొరంగడ్డ కటింగ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారులు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఇక్ఫాయ్, టీ హబ్ మధ్య ఎంవోయూ

యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యం

ఇక్ఫాయ్, టీ హబ్ మధ్య ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

చేవెళ్ల రూరల్, మార్చి 25 : స్టార్టప్‌ల అభివృద్ధి, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇక్ఫాయ్ ఇంక్యూబేటర్, టీ హబ్ ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు మంగళవారం శంకర్‌పల్లి మండల పరిధి దొంతాన్‌పల్లిలోని క్యాంపస్‌లో ఇక్ఫాయ్ వైస్ ఛాన్స్‌లర్, టీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ సుజిత్ జాగిర్దార్ ఎంవోయూ(మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్)పై సంతకాలు చేసి.. ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇక్ఫాయ్ ఉపకులపతి ఎల్ఎస్.గణేశ్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, రిసెర్చ్ స్కాలర్స్, యువ పారిశ్రామికవేత్తలకు ఇక్ఫాయ్ చక్కటి వేదికగా మారనున్నదని తెలిపారు. టీ-హబ్ నైపుణ్యంతో ఇక్ఫాయ్ విద్యా సంస్థల శక్తిని సమన్వయం చేసి స్టార్టప్‌ల ఆవిష్కరణ, శిక్షణ, నిధులు, మార్కెట్ యాక్సెస్ కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

టీ-హబ్ సీఈవో సుజిత్ జాగిర్దార్ మాట్లాడుతూ.. స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో టీ హబ్ ముందు వరుసలో ఉంటుందని, ఇక్ఫాయ్ ఒప్పందం ద్వారా మరిన్ని వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించే అవకాశం దక్కిందన్నారు. పరిశోధన, పారిశ్రామిక ఆవిష్కరణల మధ్య వారధిగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇక్ఫాయ్ ఇంక్యుబేటర్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సాయినాథ్ మణికొండ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీ హబ్ ప్రతినిధులు సీనియర్ ఇన్వెస్టర్ స్టార్టప్ ఫండ్ డైరెక్టర్ చింటిరెడ్డి, చీఫ్ డెలివరీ ఆఫీసర్ ఫణి, ఇక్ఫాయ్ రిజిస్ట్రార్ డాక్టర్ విజయలక్ష్మి, బ్రాండింగ్ డైరెక్టర్ సుధాకర్‌రావు, డైరెక్టర్లు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

కొత్తపేటలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బోధనా కేంద్రం ప్రారంభం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బోధనా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జయచంద్రారెడ్డి, చంద్రశేఖర్

కేశంపేట, మార్చి 25 : మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బోధనా కేంద్రాన్ని ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్ ల్యాబ్ అకాడమిక్ మానిటరింగ్ జిల్లా అధికారి జయచంద్రారెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కొత్తపేటలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్ ల్యాబ్ చదువులో వెనుకబడిన పిల్లలకు కృత్రిమ మేధస్సు ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. చదవడం, రాయడం రానివారికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బోధనా కేంద్రం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడం జరుగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా 13 సెంటర్లు మంజూరయ్యాయని, అందులో మన జడ్పీహెచ్ఎస్‌కు చోటు లభించడం సంతోషకరమన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో 50 మంది విద్యార్థులు గల పాఠశాలల్లో సైతం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బోధనా కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్వీలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు, సీఆర్వీలు, కంప్యూటర్ ఆపరేటర్ గోపి పాల్గొన్నారు.

కేంద్రమంతి బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలి

పోలీసులకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు



బండి సంజయ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, మార్చి 25 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ నిరాధారమైన ఆరోపణలు చేశారని, ఆయనపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు గోపాల్‌ముదిరాజ్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండి సంజయ్ కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. కేసీఆర్‌కు బీదర్‌లో దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉందని, ఎన్నికల్లో ఆ దొంగ నోట్లు ఓటర్లకు పంపిణీ చేశారని ఆరోపించారన్నారు. బండి సంజయ్ ప్రింటింగ్ ప్రెస్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉన్నా బయటపెట్టాలి. అదే విధంగా ఎక్కడ దొంగ నోట్లు పంపిణీ చేశారో వాస్తవాలను ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు. కానీ ఇవన్నీ ఏవీ తెలుపకుండా మా పార్టీ అధ్యక్షుడిపై కేంద్ర మంత్రిగా ఉండి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలుగా, కేసీఆర్ అభిమానులుగా తమ మనసును గాయపరిచాయన్నారు. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్ పార్టీపై చెడు ప్రభావాన్ని చూపుతాయని, రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి ఓటేసిన లక్షల మంది మనోభావాలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు కేసీఆర్ పేరు ప్రతిష్ఠలు దిగజార్చే విధంగా ఉన్నాయన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీలు, రెండు వర్గాల మధ్య వైరుధ్యాలు సృష్టించి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని తెలిపారు. బీఎన్ఎస్ 196 ప్రకారం ఈ వ్యాఖ్యలు శిక్షార్హమైనవన్నారు. బాధ్యతాయుత పదవిలో ఉండి కేసీఆర్‌పై అర్థికపరమైన నిందారోపణలు చేసి, పరువు ప్రతిష్ఠలు దిగజారేలా మాట్లాడిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ టౌన్ ఉపాధ్యక్షుడు సుభాన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముర్తుజాఅలీ, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, నాయకులున్నారు.

అక్రమ బ్లాస్టింగ్‌పై దాడి

ఇద్దరు అరెస్ట్

ఐదు జిలెటిన్ స్టిక్స్, ఐదు డిటోనేటర్లు స్వాధీనం

అక్రమ బ్లాసింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆదిబట్ల, మార్చి 25 : అనుమతులు లేకుండా అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన మంగళవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తుర్కయాంజాల్ పరిధిలోని లక్ష్మి టౌన్‌షిప్ వెనుక ఉన్న జర్నలిస్ట్ కాలనీలో అక్రమంగా బ్లాస్టింగ్ చేపడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఓటి మహేశ్వరం జోన్ పోలీసులు ఆదిబట్ల పోలీసుల సహకారంతో దాడి చేశారు. అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా ఇద్దరు వ్యక్తులు బ్లాస్టింగ్ చేస్తుండటంతో వారిని పట్టుకున్నారు. అందులో నల్లగొండ జిల్లా, గుర్రంపోడు గ్రామం కు చెందిన గుర్రం గిరి, గుర్రంపోడు మండలం తంగరుపల్లి గ్రామానికి చెందిన రాష్కపు నర్సింహలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి జిలెటిన్ స్టిక్స్ 5, డిటోనేటర్లు 5, కనెక్టింగ్ వైర్ 5 మీటర్లు, ఐషర్ 380 కంప్రెషన్ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో

ఇద్దరు స్నేహితులు దుర్మరణం

వికారాబాద్, మార్చి 25 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణంపాలైన సంఘటన మోమిన్‌పేట మండల పరిధిలో జరిగింది. మోమిన్‌పేట సీఐ వెంకట్ కథనం ప్రకారం.. బంట్వారం మండలంలోని రొంపల్లి గ్రామానికి చెందిన యువకులు బైకిని నరేశ్(21), మంగలి మనోజ్‌కుమార్(సన్నీ)(19) రొంపల్లి నుంచి బైక్‌పై సోమవారం రాత్రి మోమిన్‌పేటకు వస్తున్నారు. ఈ క్రమంలో మోమిన్‌పేట మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామ శివారులోని కార్తికేయ కంపెనీ వద్దకు వచ్చారు. రాత్రి 9.55 గంటల సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడడంతో వారికి బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందారు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మంగలి మనోజ్ తల్లి సుజాత ఫిర్యాదు మేరకు మోమిన్‌పేట ఎస్సై అరవింద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాద విషయం తెలుసుకున్న మోమిన్‌పేట ఎస్ఐ, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, సీఐ వెంకట్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ ప్రమాదానికి కారణమైన నేర వాహనం ఆచూకీ గురించి పోలీసు సిబ్బందిని మూడు టీములుగా ఏర్పాటు చేశారు. మృతదేహాలకు మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పంచనామాలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్ మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ చేసే సమయంలో తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి నడపరాదన్నారు.

నేటి నుంచి ఎంజీఐటీలో

'నిర్వాణ్-25'

మణికొండ : గండిపేటలోని ఎంజీఐటీ వార్షికోత్సవాన్ని 'నిర్వాణ్-25' పేరిట బుధవారం నుంచి నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి నిర్వాణ్-25 పోస్టర్‌ను ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు హాజరై సాంకేతిక పరిశోధన సదస్సులు, వివిధ రకాల ప్రదర్శనలు, ఆటపాటలతో కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

ఎంబీఏ కోర్సుల తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్ - ఈవినింగ్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 17 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన సూచించారు.

నది చెంతనే ఉన్నా.. నీటికి చింతే..!

- తాండూరులో తాగునీటి వెతలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

కాగ్నానది నుంచి తాండూరుకు నీటి సరఫరా చేసే కొత్త పంప్‌హౌస్

తాండూరు, మార్చి 25 : తాండూరు నియోజకవర్గంలో నెలకొన్న తాగు, సాగు నీటి సమస్యలు ప్రజలను కరువు కోరల్లోకి నెడుతున్నాయి. జలసంరక్షణ చేపట్టకపోవడం, జలాశయాల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోని ఫలితంగా కాంగ్రెస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో ఎండకాలం ప్రారంభంలోనే కరువు ఛాయలు కమ్ముకున్నాయి. బీఆర్ఎస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో ఇందుకు భిన్నంగా ఉండేది. బహుముఖ వ్యూహాల ఫలితంగా సమృద్ధిగా తాగు, సాగునీరు అందుబాటులో ఉండేది. పదేండ్ల కేసీఆర్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామం కూడా కరువు పీడిత ప్రాంతంగా ఉండేది కాదు. మండుటెండల్లో సైతం తాగు, సాగు నీరు సమృద్ధిగా ఉండేది. నేడు నియోజకవర్గంలోని తాండూరు పట్టణంతో పాటు తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండల పరిధుల్లో నిత్యం ఏదోఒక చోట నీటి సమస్య వస్తున్నది. ఇక పంట సాగుకు నీటి సమస్యలు అనేకంగా ఉండడంతో చేతికొస్తున్న పంట ఎండిపోతున్నది.

తాండూరు మున్సిపల్‌లో 36 వార్డులు, 13,214 నివాస గృహాలు, 80 వేలకు పైగా జనాభా, 9 వేలకు పైగా మంచి నీటి నల్లాలు ఉన్నాయి. ప్రజలు తాగేందుకు నిత్యం 8.5 ఎం.ఎల్.డి నీరు కావాలి. కానీ ప్రస్తుతం 6.5 ఎం.ఎల్.డి నీరు మాత్రమే సరఫరా అవుతున్నది. ఇంకా 2.0కు పైగా ఎం.ఎల్.డి నీటి కొరత ఉన్నట్లు సమాచారం. ఇందుకు పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే స్పష్టంగా కనిపిస్తున్నది. తాండూరు పట్టణానికి కిలోమీటర్ సమీపంలోనే కాగ్నానది ఉన్నది. ప్రజలకు మంచి నీటి సమస్య తలెత్తకుండా రూ. కోట్ల నిధులతో రెండు పంప్‌హౌస్‌లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా తాండూరుకు సమృద్ధిగా నీళ్లు అందేవి. ప్రస్తుతం ఈ పంప్‌హౌస్‌లు పాడై మరమ్మతులకు నోచుకోలేకపోవడంతో తాండూరులో నీటి కష్టాలు మొదలయ్యాయి. దీంతో కాలనీల్లో ప్రైవేటు వాటర్ ప్లాంట్లలో అశాస్త్రీయంగా శుద్ధి చేసిన నీటిని ప్రజలు కొనుగోలు చేసి తాగుతున్నారు. ఇందుకు ప్రతినెల చిన్న కుటుంబానికి రూ.600 నుంచి రూ.800 అవుతున్నాయి. పెద్ద కుటుంబాలకు నెలకు సుమారు రూ.900 నుంచి రూ.1200 వరకు ఖర్చవుతున్నట్లు సమాచారం. పంప్‌హౌస్‌లో నీటిని తోడే మిషన్లు రాష్ట్రంలో అందుబాటులో లేకపోవడంతో పాటు రాజస్థాన్, అహ్మదాబాద్‌ల నుంచి తీసుకురావాల్సింది ఉందని.. అందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని శాసన సభలో ఇటీవల తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సీఎంను కూడా కోరారు.

బీఆర్ఎస్ పాలనలో తాండూరు కాగ్నా నది, యాలాల కాక్రవేణి నదిలో నీటి నిల్వ కోసం కోట్ల నిధులతో చెక్ డ్యాంలను నిర్మించారు. కాగ్నానదిలో నీరున్నప్పటికీ కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో పంప్‌హౌస్‌కు, పాడైన పైపులకు మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. మిషన్ భగీరథ నీరు రోజు విడిచి రోజు రావడంతోపాటు మిషన్ భగీరథ కనెక్షన్ లేని కాలనీల్లో నీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు.



కాగ్నానది నుంచి తాండూరుకు నీటి సరఫరా చేసే పాత పంప్‌హౌస్

సిద్ధన్నమడుగుతండాలో నీటి ఎద్దడి

సిద్ధన్నమడుగుతండాలో ట్రాక్టర్ నుంచి నీళ్లు పట్టుకుంటున్న ప్రజలు

పెద్దేముల్ మండలం సిద్ధన్నమడుగుతండాలో కూడా మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణం పనులతో పైప్‌లైన్లు పోవడంతో వాటికి సకాలంలో పాలకులు, అధికారులు మరమ్మతులు చేయించకపోవడంతో నీళ్లు రావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ట్రాక్టర్ల ద్వారా నిత్యావసర పనులకు, తాగేందుకు నీళ్లను పట్టుకుంటున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇలా నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఏదో ఒక చోట నిత్యం మంచినీళ్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇందుకు కాంగ్రెస్ సర్కార్ వేసవి చర్యలు చేపట్టకపోవడమే కారణమని స్పష్టంగా తెలుస్తున్నది. పశువులకు కూడా నీటి సమస్యలు తప్పడంలేదు. బీఆర్ఎస్ పాలనలో పశువులు తాగేందుకు ఏర్పాటు చేసిన నీటి కుండీల్లో కూడ నీరు కనిపిస్తలేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి నియోజకవర్గంలో తాగు, సాగు నీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లిం సోదరులు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న శ్రీశైల్‌రెడ్డి

ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో విఠల్‌రెడ్డి

తాండూరు, మార్చి 25 : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సౌజన్యంతో మంగళవారం రాత్రి తాండూరులోని క్లాసిక్ గార్డెన్‌లో వందలాదిమంది ముస్లిం సోదరులకు 'ఇఫ్తార్ విందు'ను ఇచ్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం విందు భోజనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి మాట్లాడుతూ.. మత సామరస్యానికి రంజాన్ ప్రతీక అన్నారు. మహ్మద్ ప్రవక్త ప్రపంచానికి ఇచ్చిన శాంతి సందేశం ప్రకారమే ముస్లింలు నడుచుకుంటారని తెలిపారు. కేసీఆర్ ముస్లిం, మైనార్టీలకు పెద్దపీట వేస్తే.. కాంగ్రెస్ పాలనలో ముస్లింలకు పదవులు కూడా ఇస్తలేరని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. ముస్లింలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలిపారు. ఇఫ్తారు విందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు విఠల్‌రెడ్డి, రాజుగౌడ్, నయీం, నర్సిరెడ్డి, నర్సింహులు, ముస్లిం పెద్దలు ఉన్నారు.

'రీవాల్యుయేషన్'కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు. ఈ రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల రెండో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 29 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్లో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

బీఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలు విడుదల

ఓయూ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరిలో నిర్వహించిన కోర్సుల పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూస